Digital
7TV ఫోకస్ న్యూస్

విలేకరులు కావలెను
7TV ఫోకస్ న్యూస్
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా వెలువడుతున్న 7tv ఫోకస్ న్యూస్ పత్రికలో బ్యూరో, మండలలా రిపోర్టర్‌గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయుల్లో ఉత్సాహవంతులైన యువతి,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.
సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 94906 17567

ఎడిటర్ : మరే చిన్న బాబు తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 01 సంచిక : 23 సోమవారం , ఆగస్టు 10, 2026 , పేజీలు - 5 వెల : 2 /-



గిరిజన అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

విజయవాడలో కార్యక్రమం... హాజరైన సీఎం చంద్రబాబు

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని సీఎం పిలుపు

జీవో నెంబర్ 3ను చట్టపరంగా కాపాడతామని ఆదివాసులకు భరోసా

అరకు కాఫీ తరహాలో స్థానిక గిరిజన ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్

అమరావతిఆగస్టు 9

అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం వేదికగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. దేశభక్తి అంటే కేవలం సరిహద్దుల్లో పోరాడటం మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన వృత్తిలో విజయం సాధించి, సమాజానికి సేవ చేయడమే నిజమైన దేశభక్తి అని ఉద్బోధించారు. ప్రతి ఒక్కరూ తమకంటూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా విజయవాడ అంబేద్కర్ కళావేదికలో జరిగిన సభకు చంద్రబాబు ముఖ్య

మిగతా 2లో.



స్వాతంత్ర్య పోరాటానికి 'క్విట్ ఇండియా'


కొత్త శక్తినిచ్చింది

క్విట్ ఇండియా ఉద్యమం స్వాతంత్ర్య పోరాటానికి కొత్త ఊపునిచ్చిందన్న ప్రధాని

ఉద్యమకారుల ధైర్యసాహసాలు, త్యాగాలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని వ్యాఖ్య

'డూ ఆర్ డై' సంకల్పాన్ని దేశప్రజల్లో నింపిందని గుర్తు చేసుకున్న అమిత్ షా

ఉద్యమకారులకు నివాళులర్పించిన ప్రధాని, కేంద్ర హోంమంత్రి, యూపీ సీఎం



ఢిల్లీ ఆగస్టు 9:

చారిత్రాత్మక క్విట్ ఇండియా ఉద్యమం స్వాతంత్ర్య సంగ్రామానికి కొత్త శక్తిని అందించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ ఉద్యమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన స్వాతంత్ర్య సమరయోధులకు ఘనంగా నివాళులర్పించారు. వారి ధైర్యసాహసాలు, త్యాగాలు రాబోయే తరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయని ప్రధాని పేర్కొన్నారు.ఆగస్టు విప్లవంలో పాల్గొన్న నేతలను, సమరయోధులను స్మరించుకుంటూ ప్రధాని మోదీ 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. "మహాత్మా గాంధీ నాయకత్వ స్ఫూర్తితో ప్రారంభమైన క్విట్ ఇండియా ఉద్యమం

మిగతా 2లో.

మమతా బెనర్జీ కారుపై రాళ్ల దాడి

మృతి చెందిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లగా ఘటన

పోలీసుల సమక్షంలోనే దాడి జరిగిందని మమత ఆరోపణ

దాడిని ఖండించిన బీజేపీ, తమకు సంబంధం లేదని వెల్లడి

మరణాన్ని రాజకీయం చేస్తున్నారంటూ మమతపై సువేందు అధికారి విమర్శ



కోల్‌కతా ఆగస్టు 9:

పశ్చిమ బెంగాల్‌లో రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రయాణిస్తున్న కారుపై నిరసనకారులు దాడికి పాల్పడ్డారు. కోల్‌కతా సమీపంలోని ఉత్తర 24 పరగణాల జిల్లా హాలిసహర్‌లో ఈ ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఆమె కాన్వాయ్‌పై కొందరు రాళ్లు, ఇటుకలు, వాటర్ బాటిళ్లు విసిరారు.

మిగతా 2లో.

పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి

కేసీఆర్ పరామర్శ..



రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందజేత

నల్లబెల్లిలో దివంగత ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ

హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించిన కేసీఆర్

రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం చెక్కులు అందజేత

సుదర్శన్‌రెడ్డితో అనుబంధాన్ని గుర్తుచేసుకుని భావోద్వేగం

పార్టీ అండగా ఉంటుందని కుటుంబానికి భరోసా

నర్సంపేట ఆగస్టు 9 : బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్ జిల్లా నల్లబెల్లిలో పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ ప్రకటించిన రూ.2.25 కోట్ల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను కేసీఆర్ స్వయంగా

మిగతా 2లో.

రాజమండ్రి ఘటనలో గాయపడిన

ప్రియాంక మృతి

సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచిన వైనం

మరణాన్ని ధ్రువీకరించిన వైద్యులు

ప్రమాదానికి కారణమైన ఇద్దరు నిందితులు ఇప్పటికే అరెస్ట్



హైదరాబాద్ ఆగస్టు 9:

రాజమండ్రిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మెడికో ప్రియాంక మృత్యువుతో పోరాడి ఓడిపోయింది. గత ఐదు రోజులుగా సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆమె శుక్రవారం తుదిశ్వాస విడిచింది. ఓ వైద్యురాలిగా ఎంతో భవిష్యత్తు ఉన్న ప్రియాంక అర్ధాంతరంగా తనువు చాలించడంతో ఆమె కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

మిగతా 2లో.

క్షేత్రస్థాయిలో పర్యటించాలి

మంత్రులకు లోకేశ్ కీలక ఆదేశాలు

14 రోజుల్లో 40 లక్షల కుటుంబాలను కలిసిన టీడీపీ శ్రేణులు

కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రజలకు వివరణ



2లో.

బస్సులారీ ఢీ..

35 మందికి గాయాలు!

పామిడి మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం

ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలు.. 15 మంది పరిస్థితి విషమం

బ్రిడ్జిపై నుంచి కిందకు పడిన వాహనాలు



2లో.

నేటితో సర్ ఆఖరు

హైదరాబాద్‌లో 40 లక్షల ఓట్లు గల్లంతు?.. ఓటర్ల జాబితా సర్వేతో భారీ మార్పులు!

సుమారు 40 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగింపు అంచనా

సొంతూరిలో ఓటు హక్కుకే వలసదారుల మొగ్గు

సనత్‌నగర్‌లో అత్యధికంగా 45శాతం ఓట్ల రద్దుకు అవకాశం

ఆగస్టు 17న విడుదల కానున్న ముసాయిదా ఓటర్ల జాబితా



2లో.

గిరిజన అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

మొదటిపేజీ తరువాయి

అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... గిరిజన సమాజానికి సమగ్ర అభివృద్ధి, సంక్షేమంపై పలు కీలక హామీలు ఇస్తూ, వారి హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు.

సాధారణ ఆదివాసీ కుటుంబంలో పుట్టి, అనేక కష్టాలను అధిగమించి, దేశ ప్రథమ పౌరురాలిగా అత్యున్నత శిఖరాలను అధిరోహించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని చంద్రబాబు అన్నారు. ఆమె స్ఫూర్తితో గిరిజన యువత ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని సూచించారు. జాతీయ జెండాతో పాటు మీ అజెండా కూడా ఉండాలని పిలుపునిచ్చారు.

"సంకల్పం బలంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు. ద్రౌపది ముర్ము, అబ్దుల్ కలాం, బీఆర్ అంబేద్కర్, ఎన్టీఆర్, నరేంద్ర మోదీ వంటి మహనీయులంతా సాధారణ కుటుంబాల నుంచి వచ్చినవారే. 'నేను ఏంటి? ఎలా ఎదగాలి? ఈ సమాజానికి, దేశానికి నేనేం ఇవ్వాలి?' అనే లక్ష్యంతో పనిచేయాలి. మీ విజయం దేశ విజయమవుతుంది.." అని ఆయన పేర్కొన్నారు. ఈ స్ఫూర్తిని వ్యాపింపజేసేందుకు ఆగస్టు 9 నుంచి 15 వరకు 'అనే నేను' పేరుతో ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

గిరిజన ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్.. అరకు కాఫీ ఒక సక్సెస్ స్టోరీ

గిరిజన ప్రాంతాల్లోని ఆర్థిక స్వావలంబనపై చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. తాను 25 ఏళ్ల క్రితం ఒక చిరు ప్రయత్నంగా ప్రారంభించిన అరకు కాఫీ, నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచడాన్ని ఆయన గుర్తుచేశారు. "అరకు కాఫీకి నేనే పేరు పెట్టాను. దానిని మార్కెటింగ్ చేసి, ప్రధాని నరేంద్ర మోదీ నుంచి ఆస్ట్రేలియా ప్రధాని వరకు బహుకరించి, గ్లోబల్ బ్రాండ్‌గా నిలబెట్టాను. ఇవాళ పారిస్‌లో కూడా అరకు కాఫీ స్టాళ్లు ఉన్నాయి" అని గర్వంగా ప్రకటించారు.

ఇదే స్ఫూర్తితో సీతంపేట పసుపు, రంపచోడవరం రబ్బర్, పార్వతీపురం పైనాపిల్, తేనె, తాటిబెల్లం వంటి స్థానిక ఉత్పత్తులకు విలువ జోడించి, బ్రాండింగ్ చేసి, మార్కెటింగ్ చేసే బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లోని రైతులు పండించే ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ సంస్థలతో 19 అవగాహన ఒప్పందాలు



(ఎంఓయూ) కుదుర్చుకున్నట్లు వెల్లడించారు.

మౌలిక వసతులు, విద్య, వైద్యానికి పెద్దపీట

గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి నాలుగు కీలక రంగాలపై దృష్టి పెడుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం, ఆదాయ మార్గాల పెంపునకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.

మౌలిక వసతులు: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అధ్వర్యంలో 2,336 గిరిజన ఆవాసాలకు మిషన్ మోడ్‌లో రోడ్ కనెక్టివిటీ కల్పిస్తామన్నారు. 'జల్ జీవన్ మిషన్' కింద 2027 డిసెంబర్ నాటికి ప్రతి గిరిజన ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. మారుమూల గ్రామాలకు సైతం టెలికాం కనెక్టివిటీ అందించి, డోలీ మోతలు లేని సమాజాన్ని నిర్మిస్తామన్నారు.

విద్య: 'తల్లికి వందనం' కింద 4.92 లక్షల మంది గిరిజన విద్యార్థులకు రూ.650 కోట్లు అందించామని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. విశాఖలోని మేకవారిపాలెంలో 600 మంది విద్యార్థులతో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేసి, ఐఐటీ వంటి జాతీయ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఏటా కనీసం 100 మంది గిరిజన విద్యార్థులు జాతీయ స్థాయి సంస్థల్లో సీట్లు సాధించడమే లక్ష్యమన్నారు.

వైద్యం: పాడేరులో మెడికల్ కాలేజీతో పాటు పార్వతీపురం, రంపచోడవరం, శ్రీశైలం వంటి ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మిస్తామన్నారు. 'సంజీవిని' ప్రాజెక్ట్ ద్వారా ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను డిజిటలైజ్ చేస్తామని, సికిల్ సెల్ అనీమియా బాధితులకు రూ.10,000 పింఛను అందిస్తూ, వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రకటించారు.

జీవో నెంబర్ 3 పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం

గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలు స్థానికులకే దక్కాలనే ఆశయంతో ఎన్టీఆర్ హయాంలో పురుడుపోసుకుని, తాను 2000 సంవత్సరంలో తీసుకొచ్చిన జీవో నెంబర్ 3ను కాపాడతామని చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. సుప్రీంకోర్టులో ఈ జీవోను కొట్టివేయడానికి గత ప్రభుత్వ వైఫల్యమే కారణమని విమర్శించారు. "ఈ జీవోను చట్టపరంగా, రాజ్యాంగబద్ధంగా నిలబడేలా పటిష్టమైన కార్యాచరణ రూపొందిస్తాం. ఆదివాసుల హక్కుల పరిరక్షణకు ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఆవేశంతో కాకుండా ఆలోచనతో, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని దీనిపై ముందుకు వెళతాం" అని భరోసా ఇచ్చారు.

గిరిజన ప్రాంతాలను కేవలం వెనుకబడిన ప్రాంతాలుగా కాకుండా, అపార అవకాశాలున్న ప్రాంతాలుగా చూస్తున్నామని, అక్కడి పచ్చదనం, స్వచ్ఛమైన వాతావరణాన్ని ఉపయోగించుకుని టూరిజం హబ్‌లుగా తీర్చిదిద్దుతామని అన్నారు. ప్రతి గిరిజన ఇల్లు 'అతిథి గృహం'గా మారాలని, తద్వారా ప్రపంచానికి ఆతిథ్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఒక చెట్టు నాటి, దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి 'వికసిత్ భారత్', 'స్వర్ణాంధ్రప్రదేశ్' లక్ష్యాలను సాధించడంలో ఆదివాసీలు కీలక పాత్ర పోషించాలని, వారి సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు.

పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి కేసీఆర్ పరామర్శ..

మొదటిపేజీ తరువాయి



సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. నల్లబెల్లిలోని నివాసానికి చేరుకున్న కేసీఆర్, తొలుత సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సుదర్శన్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని కేసీఆర్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. సుదర్శన్‌రెడ్డి అత్యంత సాదాసీదా జీవితం గడిపారని, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మంచి నేత అని కొనియాడారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ పార్టీ తరపున ప్రకటించిన ఆర్థిక సాయంలో భాగంగా సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లల పేరున చెరో రూ.1 కోటి, ఆయన తల్లి అమృతమ్మ సంరక్షణ కోసం రూ.25 లక్షల చెక్కులను కేసీఆర్ అందించారు. పిల్లల చదువులు, భవిష్యత్తుతో పాటు కుటుంబ సంక్షేమ బాధ్యతలను పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తుందని స్పష్టం చేశారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

కేసీఆర్ రాక సందర్భంగా నల్లబెల్లికి బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాసం వద్ద జనం కిక్కిరిసిపోవడంతో స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి, పరిస్థితిని అదుపులోకి తెచ్చి కేసీఆర్ కాన్వాయ్‌కు దారి కల్పించారు. కేసీఆర్ వెంట పలువురు పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

మమతా బెనర్జీ కారుపై రాళ్ల దాడి

మొదటిపేజీ తరువాయి

పోలీసు కస్టడీలో మరణించినట్లు భావిస్తున్న తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) కార్యకర్త బిర్జూ కియోట్ కుటుంబాన్ని పరామర్శించేందుకు మమతా బెనర్జీ వెళుతుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. దోపిడీ ఆరోపణలపై అరెస్టయిన బిర్జూ, పోలీసుల కస్టడీలో మరణించాడు. ఈ నేపథ్యంలో, మమత పర్యటనను వ్యతిరేకిస్తూ స్థానికులు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. ఆమె కారును చుట్టుముట్టి, దానిపై బురద పూశారు. "చోర్ భగావో" (దొంగను తరిమేయండి) అంటూ నినాదాలు చేశారు.

ఈ దాడిపై మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. పోలీసుల సమక్షంలోనే గుర్తుతెలియని వ్యక్తులు తన వాహనంపై రాళ్లతో దాడి చేశారని ఆమె ఆరోపించారు. "కారు అద్దాలు మూసి ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డాను. లేదంటే ఆ రాళ్లు తలకు తగిలి నా తల పగిలిపోయేది" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని, వారు కేవలం అధికార బీజేపీకి మాత్రమే రక్షణ కల్పిస్తున్నారని మండిపడ్డారు. ఆమెతో పాటు ఉన్న లోక్‌సభ ఎంపీ కల్యాణ్ బెనర్జీ, రాజ్యసభ ఎంపీ డోలా సేన్ కూడా అధికారుల వైఫల్యాన్ని విమర్శించారు.ఈ ఘటనను రాష్ట్ర బీజేపీ చీఫ్ సమీక్ భట్టాచార్య ఖండించారు. ఈ దాడితో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను డిమాండ్ చేశారు.అయితే, సీఎం సువేందు అధికారి దీన్ని మమత సృష్టించిన డ్రామాగా అభివర్ణించారు. కస్టడీ మరణాన్ని రాజకీయం చేసేందుకే మమత బలవంతంగా ఆ ప్రాంతానికి వెళ్లారని ఆరోపించారు. మృతుడి కుటుంబ సభ్యులు అధికారుల తీరుపై సంతృప్తి చెందారని, మరణానికి కచ్చితమైన కారణం తెలియాలని మాత్రమే వారు కోరుకుంటున్నారని తెలిపారు. తన పర్యటనతో మమత ప్రజా జీవితానికి ఆటంకం కలిగించారని విమర్శించారు.

ఇటీవలే మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై కూడా ఆయన నియోజకవర్గంలో దాడి జరిగిన నేపథ్యంలో, తాజా ఘటనతో రాష్ట్రంలో రాజకీయ ఉద్రిక్తతలు మరింత పెరిగాయి

నేటితో సర్ ఆఖరు

హైదరాబాద్ ఆగస్టు 9:

రాజధాని హైదరాబాద్ నగరంలో ఓటర్ల సంఖ్యలో భారీ మార్పులు చోటుచేసుకోబోతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సర్వే (ూ×=) కారణంగా గ్రేటర్ పరిధిలో ఏకంగా 40 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగిపోయే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. రేపటితో ఈ సర్వే కార్యక్రమం ముగియనుండగా, నిన్నటి వరకు ఉన్న సమాచారం ప్రకారం రాజధానిలోని మూడు జిల్లాల పరిధిలో ఉన్న 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 1.14 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో దాదాపు మూడో వంతు ఓట్లు రద్దయ్యే సూచనలు కనిపిస్తుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ప్రభుత్వ సెలవులు ఉన్నప్పటికీ ఆది, సోమవారాల్లో బూత్ స్థాయి అధికారుల (బీఎల్ఓ) నుంచి ఉన్నతాధికారుల వరకు విధుల్లోనే ఉంటారని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించని ఓటర్లు ఎవరైనా ఉంటే వెంటనే అందజేయాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి చేసి, ఈ నెల 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించేందుకు అధికారులు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

సనత్‌నగర్‌లో సగానికి పైగా ఓట్లు రద్దు!

ఓట్ల తొలగింపు ప్రభావం దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో ఇది అత్యధికంగా ఉంది. ముఖ్యంగా సనత్‌నగర్ నియోజకవర్గంలో మొత్తం 2,54,030 ఓట్లు ఉండగా, వాటిలో ఏకంగా 1.16 లక్షల ఓట్లు (45.68%) రద్దయ్యే అవకాశం ఉందని అంచనా. అదేవిధంగా జూబ్లీహిల్స్‌లో 44.21%, ఎల్బీనగర్‌లో 42.19%, ఉప్పల్‌లో 40.05%, మహేశ్వరంలో 40.03% ఓట్లు జాబితా నుంచి తొలగిపోవచ్చని అధికారులు చెబుతున్నారు. అత్యల్పంగా ఇబ్రహీంపట్నంలో 21.43% ఓట్లు రద్దయ్యే అవకాశం ఉంది. రాబోయే రెండు రోజుల్లో ఈ సంఖ్యల్లో స్వల్ప మార్పులు మాత్రమే ఉండొచ్చని భావిస్తున్నారు.

ఓట్ల తొలగింపునకు కారణాలేంటి?

దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఉపాధి, ఇతర అవసరాల కోసం ప్రతిరోజూ వేలాది మంది హైదరాబాద్‌కు వలస వస్తుంటారు. ఇక్కడే స్థిరపడి ఓటరుగా నమోదు చేసుకుంటారు. అయితే, ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఓటరు సర్వే జరుగుతున్న నేపథ్యంలో.. సొంత ఊరితో పాటు హైదరాబాద్‌లోనూ ఓటు హక్కు ఉన్నవారు తమ ఓటును సొంతూరిలోనే కొనసాగించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో నగరంలో ఎన్యుమరేషన్ ఫారాలను చాలామంది అధికారులకు తిరిగి ఇవ్వలేదని తెలుస్తోంది. ఇదే ఓట్ల సంఖ్య భారీగా తగ్గడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

మరోవైపు కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమకు ఇప్పటికీ ఎన్యుమరేషన్ ఫారాలు అందలేదని లక్షలాది మంది ఓటర్లు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వారంతా ఆన్‌లైన్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. సోమవారం గడువు ముగిసిన తర్వాత తుది లెక్కలు తేలనుండగా, ఆగస్టు 17న వెలువడనున్న ముసాయిదా జాబితాపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

రాజమండ్రి ఘటనలో గాయపడిన ప్రియాంక మృతి

మొదటిపేజీ తరువాయి

వివరాల్లోకి వెళితే, ఆగస్టు 3వ తేదీన తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలోని ప్రసాదిత్యమాల్ ప్రాంతంలో ప్రియాంక తన స్కూటర్‌పై వెళుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. మద్యం మత్తులో అతివేగంగా కారు నడిపిన సురవరపు దశ్వంత్, ఆంధ్రూ జోసెఫ్ ఎడ్వర్డ్స్ అనే ఇద్దరు యువకులు ఆమె స్కూటర్‌ను ఉద్దేశపూర్వకంగా మూడుసార్లు ఢీకొట్టారు. ఈ ఘటనలో ప్రియాంక తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను రాజమండ్రిలోని స్థానిక ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని కిమ్స్‌కు తరలించారు.

అక్కడ ఆమెను కాపాడేందుకు వైద్యులు తీవ్రంగా శ్రమించారు. అయినప్పటికీ ఆమె కోలుకోలేకపోయింది. శుక్రవారం మధ్యాహ్నం 3:25 గంటలకు ప్రియాంక తుదిశ్వాస విడిచినట్టు కిమ్స్ వైద్యులు ప్రకటించారు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితులు దశ్వంత్, ఆంధ్రూలను ఇప్పటికే అరెస్ట్ చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు.

కాగా, తన కుమార్తె మృతికి కారణమైన వారిపై సాధారణ ప్రమాద కేసు కాకుండా, హత్య కేసు నమోదు చేయాలని ప్రియాంక తండ్రి డిమాండ్ చేశారు. ఇది కేవలం ప్రమాదం కాదని, ఉద్దేశపూర్వకంగా చేసిన హత్యేనని ఆయన ఆరోపిస్తున్నారు. పోలీసులు కూడా సీసీటీవీ ఫుటేజీ పరిశీలించిన అనంతరం, కావాలనే ఢీకొట్టినట్టు గుర్తించారు. హత్యాయత్నం సెక్షన్లతో కేసును మరింత పకడ్బందీగా మార్చారు.ప్రియాంక స్వస్థలం తెలంగాణలోని గద్వాల జిల్లా అయిజ మండలం ఎక్లాస్ పూర్. ఆమె ఎంబీబీఎస్ అనంతరం రాజమండ్రిలో పీజీ చేస్తోంది. ఇప్పుడు ఆమె మృతితో స్వగ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

మెడికో ప్రియాంక కుటుంబానికి రూ.20 లక్షల సాయం ప్రకటించిన సీఎం చంద్రబాబు

రాజమండ్రిలో కారు ఢీకొట్టిన ఘటనలో మృతి చెందిన వైద్య విద్యార్థిని ప్రియాంక కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రూ. 20 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఆమె మరణ వార్త తనను తీవ్రంగా కలచివేసిందని, ఈ ఘటన అత్యంత విషాదకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రియాంక కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి తక్షణమే రూ. 20 లక్షల సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై తాను ఇప్పటికే జిల్లా అధికారులతో సమీక్షించానని గుర్తుచేశారు. ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారికి కఠిన శిక్ష పడేలా చూడాలని స్పష్టం చేశారు.ఈ కేసులో నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేసి జైలుకు పంపినట్టు తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ వివరించారు. దీనిపై స్పందించిన సీఎం, నిర్లక్ష్యంగా వ్యవహరించి ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్న వారికి కఠిన శిక్ష పడేలా బలమైన సెక్షన్లు నమోదు చేయాలని సూచించారు.

బస్సులారీ ఢీ.. 35 మందికి గాయాలు!

పామిడి మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం

ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలు.. 15 మంది పరిస్థితి విషమం

బ్రిడ్జిపై నుంచి కిందకు పడిన వాహనాలు

పామిడి, ఆగస్టు 9:

పామిడి మండలంలోని పొగరూరు గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రైవేట్ బస్సు, ఐచర్ లారీ ఢీకొనడంతో అదుపుతప్పి బ్రిడ్జిపై నుంచి కిందకు పడిపోయాయి. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 35 మంది ప్రయాణికులు గాయపడగా.. వారిలో 15 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

హైదరాబాద్ నుంచి బెంగళూరుకు సుమారు 35 మంది ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేట్ బస్సు ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో పొగరూరు సమీపంలోని 44వ జాతీయ రహదారిపైకి చేరుకుంది. అదే సమయంలో వచ్చిన ఐచర్ లారీని బస్సు ఢీకొట్టింది. దీంతో రెండు వాహనాలు అదుపుతప్పి బ్రిడ్జిపై నుంచి కిందకు పడిపోయాయి. ప్రమాదం జరిగిన వెంటనే బస్సులోని ప్రయాణికులు భయాందోళనకు గురై కేకలు వేయడంతో పరిసర ప్రాంతాల్లో కలకలం రేగింది.

క్షతగాత్రులను ఆసుపత్రికి తరలింపు

సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహకారంతో బస్సులో చిక్కుకున్న క్షతగాత్రులను బయటకు తీసి పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మొత్తం 35 మంది ప్రయాణికులకు



చికిత్స అందించగా.. 15 మంది పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది.

క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్లు

ప్రమాద తీవ్రతకు రెండు వాహనాల క్యాబిన్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇద్దరు డ్రైవర్లు క్యాబిన్లలో ఇరుక్కుపోవడంతో పోలీసులు, సహాయక సిబ్బంది గ్యాస్ కట్టర్ల సాయంతో వాహన భాగాలను తొలగించి వారిని బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు డ్రైవర్లను కూడా మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రికి తరలించారు.

నిద్రమత్తే కారణమా?

అతివేగంగా ప్రయాణించడం, డ్రైవర్లు నిద్రమత్తులోకి వెళ్లడం వల్లే ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా తెలుస్తోంది. అయితే ప్రమాదానికి అసలు కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అదృష్టవశాత్తూ ప్రమాదంలో ఎవరూ మృతి చెందలేదని, క్షతగాత్రులందరికీ వైద్య చికిత్స అందుతున్నట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

స్వాతంత్ర్య పోరాటానికి 'క్విట్ ఇండియా' కొత్త శక్తినిచ్చింది

మొదటిపేజీ తరువాయి

మన స్వాతంత్ర్య పోరాటానికి నూతన ఉత్తేజాన్ని ఇచ్చింది. వలస పాలన నుంచి విముక్తి పొందాలన్న మన ప్రజల అచంచల సంకల్పాన్ని ఇది ప్రతిబింబించింది. ఈ ఉద్యమంలో పాల్గొన్న వారందరినీ స్మరించుకుంటున్నాను. వారి ధైర్యం ప్రతి భారతీయుడికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమే" అని మోదీ తన సందేశంలో తెలిపారు.కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా క్విట్ ఇండియా ఉద్యమకారులకు నివాళులర్పించారు. ఈ ఉద్యమం దేశప్రజలందరినీ ఏకతాటిపైకి తెచ్చిందని, 'డూ ఆర్ డై' (చేయండి లేదా చావండి) అనే సంకల్పాన్ని, అద్వితీయమైన ధైర్యాన్ని వారిలో నింపిందని ఆయన గుర్తు చేసుకున్నారు. జాతి ప్రయోజనాలకు ప్రథమ స్థానం ఇస్తూ, స్వదేశీని ప్రోత్సహిస్తూ ఆత్మనిర్భర్, వికసిత భారత్ లక్ష్యాల కోసం పనిచేయడానికి ఈ రోజు స్ఫూర్తినివ్వాలని ఆయన పిలుపునిచ్చారు.ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సైతం ఉద్యమకారుల ధైర్యాన్ని, త్యాగాలను స్మరించుకున్నారు. 'డూ ఆర్ డై' నినాదంతో సమరయోధులు జాతీయ చైతన్యాన్ని రగిలించి స్వాతంత్ర్య పోరాటానికి ఒక నిర్ణయాత్మక దిశను చూపారని ఆయన పేర్కొన్నారు.1942 ఆగస్టు 8న బొంబాయిలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ 'క్విట్ ఇండియా' తీర్మానాన్ని ఆమోదించిన తర్వాత ఈ ఉద్యమం ప్రారంభమైంది. అప్పుడు మహాత్మా గాంధీ 'డూ ఆర్ డై' అనే చారిత్రాత్మక పిలుపునిచ్చారు. బ్రిటిష్ పాలన అంతం కావాలని డిమాండ్ చేశారు. బ్రిటిష్ ప్రభుత్వం కఠినంగా అణిచివేసినప్పటికీ, దేశవ్యాప్తంగా నిరసనలు, సమ్మెలు వెల్లువెత్తాయి. భారత స్వాతంత్ర్య పోరాట తుది దశలో ఇది ఒక మహోద్యమంగా నిలిచింది.

క్షేత్రస్థాయిలో పర్యటించాలి

మంత్రులకు లోకేశ్ కీలక ఆదేశాలు

అమరావతిఆగస్టు 9:

తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం 2 ఏళ్ల నమ్మకం' కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సాధించిన ప్రగతిని, సంక్షేమ ఫలాలను ప్రజలకు నేరుగా వివరించే ఈ కార్యక్రమం ఆదివారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. గడిచిన 14 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు 40.74 లక్షలకు పైగా కుటుంబాలను నేరుగా కలుసుకుని రికార్డు సృష్టించాయి.కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల నుంచి వస్తున్న అపూర్వ స్పందనతో ఈ కార్యక్రమం పండుగ వాతావరణంలో సాగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 3.53 లక్షల ఇళ్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన 'సూపర్ సిక్స్' హామీల అమలు తీరును, ఇతర సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అందుతున్న ప్రయోజనాలను ప్రతి కుటుంబానికి వివరిస్తున్నారు.

ఈ కార్యక్రమ పురోగతిపై టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ప్రత్యేక దృష్టి సారించారు. కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు ఆయన పార్టీ శ్రేణులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా, జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో తప్పనిసరిగా పర్యటించాలని, ప్రజలతో మమేకమై ప్రభుత్వ విజయాలను వివరించాలని స్పష్టం చేశారు. క్లస్టర్, మండల స్థాయి నాయకులను ఫోకస్ బూత్‌లకు అనుసంధానించి, సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి గ్రామ స్థాయి కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో సమష్టిగా పాల్గొంటున్నారని, ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని మరింత పటిష్ఠం చేయాలని టీడీపీ భావిస్తోంది.

ఆర్టీసీ బస్సులో సామాన్యుడిలా ప్రయాణించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



పోలవరం 7 టివి ఫోకస్ ఆగస్టు 9:ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐటీడీఏ కే.ఆర్.పురంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి హాజరయ్యేందు కు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆదివారం ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే బస్సులో బుట్టాయిగూడెం వరకు ప్రయాణించి తోటి ప్రయాణికులతో సామాన్యుడిలా ముచ్చటించారు ప్రయాణికుల సమస్యలు ప్రజలకు అందుతున్న రవాణా సౌకర్యాలపై వారితో ఆప్యాయంగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు ప్రజలతో మమేకమై సామాన్యుడిలా ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తీరు ప్రయాణికులను ఆకట్టుకుంది

కేశప్పగూడెంలో మిన్నంటిన 'ప్రపంచ ఆదివాసీ దినోత్సవం'

- నృత్యాలు, ప్రదర్శనలతో మార్మోగిన పురివిప్పి పూసిన గిరిసీమలు
- ఆదివాసీ హక్కులు, ఐక్యతే ధ్యేయంగా ముందుకు సాగాలని పిలుపు





7టీవీ ఫోకస్, ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం:ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కేశప్పగూడెం గ్రామపంచాయతీ లో ఆదివాసీ దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా, పండగ వాతావరణంలో నిర్వహించారు. ఉత్సాహంగా జెండా ఆవిష్కరణ – – గిరిజన వీరులకు నివాళులు

గ్రామ సర్పంచ్ సోడం భారతి ఆధ్వర్యంలో ఆదివాసీ సోదరులంతా ఏకమై జెండాను ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం కేశప్పగూడెం పురవీధుల్లో నిర్వహించిన ర్యాలీలో పోరాట యోధులు కొమురం భీం, సోయం గంగులు చిత్రపటాలకు నివాళు లర్పించారు. ఆదివాసీ సాంప్రదాయ నృత్యాలు, కోలాటాలతో వీధులన్నీ కోలాహలంగా మారాయి. "జై ఆదివాసీ... జై జై ఆదివాసీ" నినాదాలతో కేశప్పగూడెం గ్రామపంచాయతీ పరిసరాలు మార్మోగాయి.సర్పంచ్ మాట్లాడుతూ ఆదివాసీలు తెలుసుకోవాల్సిన ముఖ్యమైన హక్కులు ఉ చట్టాల గురించి వివరించారు ఈ సందర్భంగా ఆదివాసీల ఉనికి, సంస్కృతి, రాజ్యాంగ హక్కుల పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో అమల్లో ఉన్న ప్రధాన హక్కులు,పెసా చట్టం – 1996 పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లోని గ్రామసభలకు అత్యున్నత అధికారాలు ఉంటాయి. నీరు, నేల, అడవిపై నిర్ణయాధికారం స్థానిక గ్రామసభలదే. 1/70 చట్టం (భూమి బదిలీ నిరోధక చట్టం): షెడ్యూల్డ్ ప్రాంతాల్లో నాన్-ట్రైబల్స్‌కు భూముల విక్రయం లేదా బదిలీ చేయడం చట్టరీత్యా నేరం. గిరిజనుల భూములకు ఈ చట్టం పూర్తి రక్షణ కల్పిస్తుంది.అటవీ హక్కుల చట్టం-2006: తరతరాలుగా అడవులపై ఆధారపడి జీవిస్తున్న గిరిజనులకు పోడు భూములపై, అటవీ ఉత్పత్తుల సేకరణపై హక్కులను కల్పిస్తుంది.రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్: ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీల సాంస్కృతిక, సామాజిక స్వయంపత్తికి ప్రత్యేక రాజ్యాంగ రక్షణలను అందిస్తుంది.హాజరైన ప్రజాప్రతినిధులు ఉ ముఖ్య నాయకులు: ఈ ఉత్సవాల్లో గ్రామ పెద్దలు సోడం పుల్లారావు, సొందం సుమన్, చీమల వెంకటేష్, మోడియం రమేష్, బేతి రాజు, పాలకవర్గ సభ్యులు బేతి ప్రశాంత్, ఉప సర్పంచ్ మడకం రాంబాబు, కొవ్వాస్ ప్రశాంతు, సోయం వెంకటమ్మ, సున్నం పార్వతి, సర్పంచ్ సహాయకులు బేతి రాంబాబుతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు."ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాలు, అటవీ సంపదను కాపాడుకోవడమే మనందరి బాధ్యత. ఐక్యతతోనే హక్కుల సాధన సాధ్యమవుతుంది."-- కేశప్పగూడెం గ్రామ పంచాయతీ నాయకులు

బొడ్రాయి ప్రతిష్టకు మంత్రి వాకిటి శ్రీహరికి ఆహ్వానం,,



7 టీవీ న్యూస్ ఫోకస్,,, 9/8/2026/ నారాయణపేట జిల్లా ..నర్వ మండలం లక్కర్ దొడ్డి గ్రామంలో ఈనెల 17న శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ధ్వజ సహిత గ్రామ నాభి శిల (బొడ్రాయి) ప్రతిష్ట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రతిష్ట మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరిని గ్రామస్తులు కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహోత్స వానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను మంత్రికి అందజేసి కార్యక్రమానికి తప్పక హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.మంత్రి వాకిటి శ్రీహరిని ఆహ్వానించిన వారిలో గ్రామ సర్పంచ్ గొల్ల భాగ్యమ్మ దేవన్న, ఉపసర్పంచ్ వెంకటేశ్వర రెడ్డి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు, పెద్ద మల్లేష్, మాజీ సర్పంచ్, శివన్న, వార్డు సభ్యులు తిరుపతయ్య,గ్రామ పెద్దలు, చిన్న మల్లేష్ ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మదర్సా మస్జీద్ ప్రారంభోత్సవ మహోత్సవంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

దెందులూరు 7 టివి ఫోకస్ ఆగస్టు 9:జామియా అబుల్ హసన్ వారి ఆధ్వర్యంలో దెందులూరు మండలం సోమవరపాడు వద్ద నూతనంగా నిర్మించిన మదర్సా మస్జీద్ ప్రారంభోత్సవ మహోత్సవంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ముస్లిం మత పెద్దలకు చిన్నారులకు అభినందనలు తెలియజేశారు కార్యక్రమంలో పాల్గొనడానికి విచ్చేసిన మాజీ శాసనమండలి చైర్మన్ మైనార్టీ సంక్షేమం శాఖ ప్రభుత్వ సలహాదారు షరీఫ్‌ని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని అభినందనలు తెలిపారుఈ సందర్భంగా మదర్సా మస్జిదుకు విచ్చేసిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కి సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులు గులాబీ పూలను అందిస్తూ ఆత్మీయ స్వాగతం పలికారు అనంతరం ముస్లిం మత పెద్దలు మదర్సా నిర్వాహకులు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకరని శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించారు అనంతరం మదర్సా ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చేతుల మీదుగా అందజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ దేశ సమగ్రత అభివృద్ధి సామాజిక ప్రగతి సంక్షేమానికి విలువలతో కూడిన పౌరుల జీవన విధానం ఎంతో అవసరమని అటువంటి ఉన్నత విలువల ను వ్యక్తిత్వాలను చిన్నారులకు బాల్యం దశ నుంచే అందించేలా ప్రతి విద్యాసంస్థలు శిక్షణ సంస్థలు చొరవ చూపాలని సూచించారు అదేవిధంగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం



ముస్లిం మైనార్టీల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తూ అండగా ఉంటుందని తెలిపారు ఈ సందర్భంగా మదర్సా మస్జిద్ ద్వారా చేసే చిన్నారుల సంక్షేమ కార్యకలాపాలకు తన సహాయక సహకారాలు ఎల్లప్పుడూ అన్ని విధాల అండగా ఉంటాయని తెలిపారు ఈ కార్యక్రమంలో పలువురు కూటమీ నాయకులు ముస్లిం మత పెద్దలు మదర్సా నిర్వాహకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

కే.ఆర్. పురం ఐటీడీఏలో ఘనంగా ఆదివాసీ దినోత్సవ వేడుకలు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

పోలవరం 7 టివి ఫోకస్ ఆగస్టు 9:కే. ఆర్. పురం ఐటీడీఏలో ఆదివారం ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాలు ఆదివాసీ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు ముందుగా ఆదివాసీ ఆచార సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా ఎమ్మెల్యే భాణం ఎక్కి కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు అనంతరం ఆదివాసీ నాయకపోడు కుల దైవాలకు కొబ్బరికాయ కొట్టి కొర్రాజుల విగ్రహాన్ని ఎత్తుకున్నారు ఆదివాసీ కళాకారులతో కలిసి అడుగులు వేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు అనంతరం కార్యక్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరం రక్తదాన శిబిరాలను ఎమ్మెల్యే సందర్శించారు వివిధ శాఖలు సంస్థలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు సభా ప్రాంగణానికి చేరుకున్న అనంతరం ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు ఆదివాసీ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా వక్తలు చేసిన ప్రసంగాలు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలతో సభా ప్రాంగణం ఉత్సాహభరితంగా మారింది కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజును శాలువాతో ఘనంగా సత్కరించారు ఆదివాసీల హక్కుల సాధనకు ఎల్లప్పుడూ ముందుంటా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అనంతరం కార్యక్రమాన్ని



ఉద్దేశించి ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ ఆదివాసీల అభి వృద్ధి సంక్షేమం వారి హక్కుల సాధన కోసం తాను ఎల్లప్పుడూ ముందుంటానని అన్నారు ఆదివాసీ సమాజం అభివృద్ధి చెందితేనే ప్రాంతం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు ఆదివాసీలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తానని తెలిపారు విద్య వైద్యం ఉపాధి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు ఆదివాసీ యువత విద్య ఉద్యోగ రంగాల్లో ముందుకు రావాలని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదవాలని ఎమ్మెల్యే సూచించారు ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలు కళలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు ఆదివాసీ ప్రజల సమస్యలను



ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పోలవరం నియోజకవర్గంలోని ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి తన వంతు కృషి నిరంతరం కొనసాగుతుందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు హామీ ఇచ్చారు.శ్రీ ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో రాముల నాయక్ ట్రైకర్ చైర్మన్ బోరగం శ్రీనివాస్ ఎస్టీ కమిషన్ కాకి లక్ష్మీశాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి మార్కెట్ కమిటీ చెర్మన్ పొట్ట రామారావు బీజేపీ ఎస్టీ మోర్చా నాయకులు వంకా కాంచనమాల బోరగం వెంకటలక్ష్మి మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు కూటమి నాయకులు బండారు అనిల్ పూనెం రాజా కుంజా రమేష్ నెలటూరి మోహన్ కాల్నిడి రాంబాబు బండారు సత్యనారాయణ గణేష్ స్వామి అధికారులు ప్రజాప్రతినిధులు ఆదివాసీ సంఘాల నాయకులు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు విద్యార్థులు కళాకారులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

ముఖ్యమంత్రి పర్యటన ఒక పండుగ వాతావరణంలో నిర్వహించి విజయవంతం చెయ్యాలి

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

కలిదిండి 7 టివి ఫోకస్ ఆగస్టు 9:సోమవారం కలిదిండి మండలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొననున్న మీభూమి మీహక్కు రాజముద్రతో పొందుపరిచిన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ కార్యక్రమాన్ని ఒక పండుగ వాతావరణంలో నిర్వహించి విజయవంతం చెయ్యాలని రాష్ట్ర గృహనిర్మాణ సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులకు ఆదేశించారు ఆదివారం కలిదిండి ప్రభుత్వ జూనియర్ కాలేజీ హెలిప్యాడ్ ప్రజావేదిక తహశీల్దారు కార్యాలయం క్యాడరు సమావేశం ట్రాన్స్‌పోర్ట్ భోజనాలు పార్కింగు ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలుసూచనలు చేశారు మంత్రితోపాటు ఎమ్మెల్యేలు డా.కామినేని శ్రీనివాస్ బడేటి రాధాకృష్ణయ్య ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేశ్వర రావు జిల్లా జాయింటు కలెక్టరు యం.జె. అభిషేక్ గౌడ లు పాల్గొన్నారు అనంతరం అగ్రికల్చర్ మార్కెటు కమిటీ సమావేశ మందిరంలో ముఖ్యమంత్రి పర్యటనపై సుదీర్ఘంగా సమీక్షించారు ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లు భద్రతా చర్యలు ట్రాఫిక్ నియంత్రణ పారిశుధ్యం తాగునీరు విద్యుత్తు వైద్య సదుపాయాలు తదితర అంశాలుపై అధికారులు



ప్రత్యేక దృష్టిపెట్టాలని అన్నారు సంబంధిత శాఖలు అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పర్యటన సజావుగా జరిగేలా అవసరమైన అన్నిచర్యలు చేపట్టాలని ఆదేశించారు పర్యటన సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తిచెయ్యాలని ఆదేశించారు పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి లోటుపాట్లు ఉంటే వెనువెంటనే సరిదిద్దాలని సూచించారు ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ముఖ్యమంత్రి పర్యటనను ఒక పండుగ వాతావరణంలో నిర్వహించి విజయవంతం చెయ్యాలని కోరారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా.కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సందర్భంగా నియోజకవర్గంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టామని అన్నారు ముఖ్యమంత్రి



పర్యటనకు నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమకు జరిగిన లబ్ధిని తెలియజెయ్యాలని అభిమానం ఆనందంతో ఘనస్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు ముఖ్యమంత్రి పర్యటనతో నియోజకవర్గ అభివృద్ధికి సంక్షేమానికి మరింత ఊతం లభిస్తుందని ప్రజలు ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు కార్యక్రమాలు మరింత వేగవంతం అవుతాయని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి యం.శ్రీదేవి సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, జెడ్పీ సిఈవో పి.జగదాంబ ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న వివిధ శాఖలు అధికారులు మాజీ ఎమ్మెల్యే గంటా మురళీరామకృష్ణ మాజీ శాసన మండలి సభ్యులు కమ్మిలి విఠల్ రావు మాజీ పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ కొత్త నాగబాబు ప్రజా ప్రతినిధులు నియోజవర్గ ప్రముఖులు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏలూరు జిల్లా పర్యటన నేపద్యం లో బందోబస్తు ఏర్పాట్లపై పోలీసు అధికారుల బ్రీఫింగ్

ఏలూరు 7 టివి ఫోకస్ ఆగస్టు 9 :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి ఏలూరు జిల్లా కలిదిండి మండలం పర్యటనను పురస్కరించుకుని బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు మరియు సిబ్బందికి జిల్లా ఎస్పీ కే. ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్ ప్రత్యేకంగా బ్రీఫింగ్ నిర్వహించారు ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది అందరూ సమయపాలన పాటిస్తూ కేటాయించిన ప్రదేశాల్లో అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని ఆదేశించారు ఏలూరు రేంజ్ ఐజీ జి.వి.జి. అశోక్ కుమార్ ఐపీఎస్ ముఖ్యమంత్రి పర్యటించనున్న బందోబస్తు ప్రాంతాలను స్వయంగా పరిశీలించి అధికారులకు తగిన సూచనలు సలహాలు మరియు ఆదేశాలు జారీ చేశారు జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బందోబస్తు విధులను సెక్టార్ల వారీగా విభజించి సిబ్బంది నిర్వర్తించాల్సిన బాధ్యతలపై కూలంకషంగా వివరించారు ముఖ్యమైన ప్రాంతాలపై నిఘా హెలిప్యాడ్ ప్రజా వేదిక గ్యాలరీలు కేడర్ మీటింగ్ ప్రదేశం ప్రవేశ మార్గాలు కాన్వాయ్ రూట్ రూఫ్‌టాప్‌లు పార్కింగ్ స్థలాలు మరియు ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్ల వద్ద అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలి బీడీ బృందాలు ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా




తనిఖీ చేసిన తర్వాతే గ్యాలరీలు మరియు సభా వేదిక వద్దకు అనుమతించాలి ప్రవేశద్వారాల వద్ద కూడా కఠిన తనిఖీలు ఉండాలి సీసీ కెమెరాల ద్వారా సభా వేదిక గ్యాలరీలలోని పరిస్థితులను కంట్రోల్ రూమ్ నుండి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి ట్రాఫిక్ ఉ వీఐపీ ఏర్పాట్లు హెలిప్యాడ్ వద్ద పటిష్టమైన బారికేడింగ్ ఏర్పాటు చేయడంతో పాటు సీఎంను ఆహ్వానించే వీఐపీలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలి కాన్వాయ్ మార్గంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి ప్రతి అధికారి వైర్‌లెస్



సెట్ల ద్వారా సమాచారాన్ని ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలి డ్యూటీ పాస్‌పోర్ట్‌లో కేటాయించిన చోటే విధులు నిర్వర్తించాలి విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించినా లేదా గైర్హాజరైనా శాఖాపరమైన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ వై. ప్రసాద్ రావు ఏలూరు డీఎస్పీ డి. శ్రావణ్ కుమార్ ఎస్ బి ఇన్స్పెక్టర్ మల్లేశ్వర రావు కైకలూరు టౌన్ ఇన్స్పెక్టర్ రామ కృష్ణ రూరల్ ఇన్స్పెక్టర్ వి రవికుమార్ తో పాటు ఇతర పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు

ఖైసర్ నగర్ లో ఘనంగా బోనాల పండుగ











7టీవీ ఫోకస్ కుత్బుల్లాపూర్ : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలోని ఖైసర్ నగర్ లో బోనాల పండుగను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రేణుక ఎల్లమ్మ, పోచమ్మ తల్లి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి ప్రతిష్ఠించారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి బోనాల వేడుకలను ప్రారంభించారు. బోనాల పండుగలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని నెత్తిన బోనాలు ఎత్తుకుని భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా తరలివెళ్లారు. అనంతరం అమ్మవారి విగ్రహాలకు పూలు, పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకలకు రేణుక ఎల్లమ్మ పోచమ్మ దేవాలయ వ్యవస్థాపకులు మద్దెల సాయిబాబా సురారం పోలీస్ ఇంస్పెక్టర్ బాలరాజు, సెక్టార్ ఇంస్పెక్టర్ కృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రెసిడెంట్ బాలకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ రాజు యాదవ్, జనరల్ సెక్రటరీ వెంకటేష్‌తో పాటు రాములు, అజయ్ గుప్తా, రవీందర్, శేఖర్, శేఖర్ లక్ష్మణ్, శ్రీనివాస్‌రావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మద్దెల సాయిబాబా మాట్లాడుతూ.. బోనాల వేడుకలను ఇంత ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. రేణుక ఎల్లమ్మ, పోచమ్మ తల్లి ఆశీస్సులు ఖైసర్ నగర్ ప్రాంత ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని

నన్నేటి పుష్ప రాజ్ డిమాండ్



ఏలూరు 7 టివి ఫోకస్ ఆగస్టు 9:సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం అవుతుంది ప్రతి నేల కలెక్టర్ పర్యవేక్షణ జరగాలి మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్ప రాజ్ డిమాండ్ రాష్ట్రంలో అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్ప రాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల కోసం ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో నిధులు అధికంగా కేటాయించి ఆ నిధులను సక్రమంగా ఖర్చు చేసేలా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని అలగే విద్యార్థుల కు మంచి ఆహారం బట్టలు మంచినీరు క్రమ శిక్షణ తో కలిగిన విద్య అందించాలి అని అలాగే ప్రతి నేల కలెక్టర్ పర్యవేక్షణ జరిగితే పాఠశాలల హాస్టల్ పరిశుభ్రత బాగుంటదని అలాగే ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు కూడా పిల్లల విద్యాభ్యాసం మరియు హాస్టల్ వసతులు ఎలా ఉన్నాయో పర్యవేక్షించాలని ముఖ్యంగా ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల కోసం చదువు ఉచితంగా ఇవ్వగలిగితే విద్యార్థులు అధిక శాతం చదువుకు మొగ్గు చూపుతారని గురుకుల పాఠశాలలో ప్రతిచోట సదుపాయాలు కల్పనలో ప్రభుత్వం విఫలం అవుతుందని తగిన సదుపాయాలు కల్పించి వారు చదువుకి తోడ్పడు బడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ గురుకుల పాఠశాల విద్యార్థులను జాయిన్ చేయాలంటే అధిక సదుపాయాలు కల్పించి ప్రజలలో ఉన్న అపోహలను పారద్రోలేల ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పుష్పరాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు

ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో మంత్రి సీతక్క..

అశ్వారావుపేటలో కొమరం భీమ్ విగ్రహావిష్కరణ..
గిరిజన హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపు..

ఖమ్మం,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేటఆదివాసీల హక్కుల కోసం పోరాడిన మహనీయుల స్ఫూర్తిని కొనసాగించాల్సిన సమయం వచ్చిందా..?
అడవి బిడ్డల హక్కులు రాజ్యాంగం కల్పించినవే అయితే.. ఆ హక్కులు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్న ఆవేదన ఎందుకు వ్యక్తమవుతోంది..?
గిరిజనుల భూముల సమస్యలు.. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు.. స్వయం ప్రతిపత్తి హక్కులు.. ఇలా ఎన్నో సమస్యలపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మంత్రి సీతక్క స్పష్టం చేశారు.
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి సీతక్కతో పాటు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తదితరులు హాజరయ్యారు.అశ్వారావుపేట స్థానిక కూడలిలో ఏర్పాటు చేసిన గిరిజన పోరాట యోధుడు కొమరం భీమ్ విగ్రహాన్ని మంత్రి సీతక్క ఆవిష్కరించారు.
వాయిస్ ఓవర్:కొమరం భీమ్ విగ్రహావిష్కరణ సందర్భంగా మంత్రి సీతక్క కీలక వ్యాఖ్యలు చేశారు.
మన జాతి ఔన్నత్యాన్ని, కీర్తిని, హక్కులను కాపాడేందుకు పోరాడిన మహనీయుడి విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు.ఆదివాసీల చరిత్ర అంటేనే పోరాటాల చరిత్ర అని మంత్రి సీతక్క పేర్కొన్నారు.అడవుల్లో మన పూర్వీకులు జీవనం ప్రారంభించిన నాటి నుంచి చెట్లు, పుట్టలు, వానలు, వరదలు, అడవి జంతువులతో పోరాడుతూ జీవనాన్ని కొనసాగించారని గుర్తుచేశారు.కాకతీయులకు వ్యతిరేకంగా పోరాడిన సమ్మక్క, సారలమ్మ నుంచి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన కొమరం భీమ్ వరకు. సమానత్వం,హక్కుల కోసం అనేక పోరాటాలు జరిగాయని అన్నారు.అయితే ఆ పోరాటాలకు తగిన స్థాయిలో ఫలితాలు దక్కలేదన్న ఆవేదనను మంత్రి వ్యక్తం చేశారు.
వాయిస్ ఓవర్:రాజ్యాంగం ఆదివాసీలకు ప్రత్యేక హక్కులు కల్పించిందని సీతక్క అన్నారు.ప్రత్యేక స్వయం ప్రతిపత్తి.. భూహక్కులు.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వంటి హక్కులను రాజ్యాంగం కల్పించిందని తెలిపారు.అయితే రాజ్యాంగం కల్పించిన హక్కులు పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో గిరిజనులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎవరితోనూ తమకు శత్రుత్వం లేదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.ఏ కులాన్నీ ద్వేషించాల్సిన అవసరం లేదని.. ఏ ప్రాంత ప్రజలను వ్యతిరేకించాల్సిన అవసరం లేదని అన్నారు.
అయితే గిరిజనులకు న్యాయంగా రావాల్సిన హక్కుల కోసం మాత్రం తప్పకుండా ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు.
వాయిస్ ఓవర్:గిరిజనుల హక్కుల కోసం పోరాడిన అల్లూరి సీతారామరాజును కూడా మంత్రి సీతక్క ఈ సందర్భంగా గుర్తు చేశారు.మన్యం బిడ్డల కోసం గిరిజనేతరుడైన అల్లూరి సీతారామ రాజు పోరాటం చేశారని.. అదే స్ఫూర్తితో నేటికీ గిరిజనుల హక్కుల కోసం పోరాటాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఎవరిని వ్యతిరేకించకుండా.. ఎవరు వచ్చినా అక్కున చేర్చుకున్నామని మంత్రి అన్నారు.అయితే గిరిజన ప్రాంతాల్లో రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక అవకాశాలను గిరిజనులు పూర్తిస్థాయిలో ఉపయోగించుకునే హక్కు ఉందని.. వాటిని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని స్పష్టం చేశారు.
మంత్రి సీతక్క కామెంట్స్:
"మనకు రాజ్యాంగం కల్పించిన హక్కులు కచ్చితంగా అమలు కావాలి. గిరిజనుల భూముల సమస్యలు సహా అన్ని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నాం. ఆదివాసీల సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రి స్థాయిలో నిరంతరం ప్రయత్నాలు చేస్తున్నాం."
వాయిస్ ఓవర్:ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అడవి బిడ్డలు, పేదలు, బడుగు బలహీన వర్గాలపై ప్రత్యేక అభిమానం ఉందని మంత్రి సీతక్క అన్నారు.వెనుకబడిన వర్గాల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.అదే సమయంలో అధికారులు కూడా పేదలు, నిరక్షరాస్యులు తమ వద్దకు వచ్చినప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా గౌరవంగా చూడాలని మంత్రి సూచించారు.ప్రజల నుంచి వినతులను స్వీకరించి.. వారి సమస్యలకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు.
వాయిస్ ఓవర్:కొమరం భీమ్ పోరాట స్ఫూర్తితో గిరిజన హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.
గిరిజనుల భాష, వేషధారణ, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.
భవిష్యత్ తరాలకు అందించాల్సిన గొప్ప ఆస్తి తమ సంస్కృతేనని పేర్కొన్నారు.కొమరం భీమ్ ఆశయాల సాధన కోసం అందరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిస్తూ..జై కొమరం భీమ్ అంటూ మంత్రి సీతక్క తన ప్రసంగాన్ని ముగించారు.
అశ్వారావుపేటలో జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు.. కొమరం భీమ్ విగ్రహావిష్కరణతో పాటు గిరిజన హక్కులు, భూముల సమస్యలు, రాజ్యాంగ హక్కుల అమలుపై మరోసారి చర్చకు తెరలేపాయి.గిరిజనుల హక్కులు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా.. క్షేత్రస్థాయిలో కూడా అమలు కావాలన్నదే ఈ సందర్భంగా వినిపించిన ప్రధాన డిమాండ్.

ప్రజలు గొలుసు కట్టు వ్యాపారాల జోలికి వెళ్ళవద్దు జిల్లా ఎస్పీ: డాక్టర్.వినీత్



7,టీవీ,న్యూస్, ఫోకస్,, నారాయణపేట జిల్లా,తేది:09.08.2026,
ప్రజల సొమ్ము దోచుకోనేందుకు సైబర్ నేరగాళ్ళు రోజు,రోజుకి కొత్త కొత్త పోకడలతో ప్రజల బలహీనతలను పెట్టుబడిగాచేసుకోనేందుకు సైబర్ నేరగాళ్లు కొత్త పంథాలను ప్రయోగిస్తున్నారు.మోసపూరిత వాగ్దానాలు, ప్రకటనలతో మోసాలకు పాల్పడుతున్న మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీముల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్. ప్రజలకు ఒక ప్రకటనలో తెలిపారు.గొలుసుకట్టు వ్యాపారాలు చేస్తూ ప్రజలను మోసం చేసే మల్టిలెవెల్ వ్యాపారాలు పెరుగుతున్నాయి, మీ క్రింద ఎక్కువ మంది ఏజెంట్లను చేర్పించి తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు పొందండి అనే వాటిని నమ్మవద్దు అని ఎస్పీ అన్నారు. ఇలాంటి మల్టీలెవల్ వ్యాపారం చేస్తూ ప్రజల నుండి డబ్బులు సేకరించి ఆర్థికంగా మోసం చేస్తూ చైన్ సిస్టం మార్కెటింగ్ వ్యాపారాల ద్వారా ఆర్థికపరమైన మోసాలు జరుగుతున్నాయని ప్రజలు గుర్తించాలని కోరారు. ఎక్కువమంది ఏజెంట్లను చేర్పిస్తే రివార్డులు, పాయింట్లు లభిస్తాయని కేటుగాళ్లు ఆశ చూపుతారు. ఇలాంటి వారి మాయమాటలు నమ్మి అత్యాశకు పోతే భారీగా ఆర్థిక నష్టం జరుగుతుంది అన్నారు.సైబర్ మోసగాళ్ళు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. సైబర్ మోసాల పట్ల ప్రజల్లో అవగాహన పెరగడంతో సైబర్ మోసగాళ్లు మల్టీలెవెల్ మార్కెటింగ్ పై దృష్టి సారించి గొలుసుకట్టు వ్యాపారాల పేరుతో వాట్సప్, టెలిగ్రామ్, ఫేస్బుక్ లాంటి సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రకటనలు చేసి అమాయకులను ఆకర్షించి మోసగించి ఆర్థిక నష్టాన్ని కలగజేస్తారు. మల్టీ లెవెల్ మార్కెటింగ్ ను చాలామంది విదేశాల్లో ఉండి ఒక రాకెట్ లా నడుపుతారు భారీ లాభాలు తోపాటు లగ్జరీ కార్లు, ఫారిన్ టూర్ల పేరిట తమ ముఠాలతో అమాయకులకు వలపన్నుతారని ఎలాంటి మాయ మాటలు నమ్మరాదు అని ఎస్పీ తెలిపారు.అతి తక్కువ కాలంలో అధిక లాభాలు వస్తాయని ఎవరైనా చెప్తే అది మోసమని గ్రహించాలి, లేదంటే ప్రజల్ని మాయలోకి దింపి డబ్బులు కొల్లగొడతారు, అత్యాశకు పోతే మోసపోవడం ఖాయం. గొలుసుకట్టు మార్కెటింగ్ లో ముందుగా చేరిన వారికి లాభాలు వస్తాయి ఆ తర్వాత చేరిన వారంతా తీవ్రంగా నష్టపోవాల్సిందే. ఇలాంటి నెట్వర్క్లో ఎవరు చేరొద్దు ఆయా సంస్థల నిర్వాహకులు, కంపెనీలు పెట్టే సభలు, సమావేశాలకు ఎవరు వెళ్ళవద్దు. సోషల్ మీడియాలో వచ్చే అబద్ధపు ప్రకటన పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి, అనుమానాస్పద ప్రకటనలు, వెబ్ లింకులు, ఏపీకే ఫైల్స్ లాంటివి డౌన్లోడ్ చేయవద్దు. మోసపూరిత ప్రకటనలపై, ఆర్థిక మోసాలపై వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు ఫిర్యాదు చేయండి అని ఎస్పీ తెలిపారు.

విటమిన్ బి6 మన శరీరంలో ఎన్ని విధులను నిర్వర్తిస్తుందంటే.. దీని ఉపయోగాలు చెప్పలేనివి..



ఆహారం మన శరీరానికి ఇంధనం లాంటిది. అయితే మనం తీసుకునే ఆహారం శరీరానికి అవసరమైన శక్తిగా ఎలా మారుతుంది? ఇందులో విటమిన్ బి6 కీలక పాత్ర పోషిస్తుంది. ఇది నీటిలో కరిగే పోషకం. ఆహారాన్ని శక్తిగా మార్చే ప్రక్రియలో సహాయపడటంతోపాటు మెదడు, నాడీ వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి కూడా ఇది అవసరం. నీటిలో కరిగే పోషకాలను శరీరం ఎక్కువకాలం నిల్వ చేసుకోలేకపోవడంతో, ప్రతిరోజూ ఆహారం ద్వారా తగినంత విటమిన్ బి6ని పొందడం అవసరం. వయస్సు, లింగాన్ని బట్టి విటమిన్ బి6 రోజువారీ అవసరం మారుతుంది. గర్భిణీలు, పాలిచ్చే మహిళలకు కూడా దీని అవసరం భిన్నంగా ఉంటుంది. టర్కీ, అవకాడో, చికెన్, పిస్తా, ట్యూనా చేప, శనగలు, అమరాంత్, పొద్దుతిరుగుడు విత్తనాలు, నువ్వులు, అరటిపండ్లు, ఆలుగడ్డపలు, ఫోర్టిఫైడ్ సీరియల్స్, బీన్స్ వంటి ఆహారాల్లో విటమిన్ బి6 లభిస్తుంది.గుండె ఆరోగ్యానికి..విటమిన్ బి6 గుండె ఆరోగ్యానికి కూడా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రొటీన్లు అధికంగా ఉండే ఆహారం తీసుకున్నప్పుడు రక్తంలో హోమోసిస్టీన్ అనే అమైనో ఆమ్లం ఏర్పడుతుంది. ఇది అధికంగా ఉంటే వాపు, గుండె సంబంధిత సమస్యల ప్రమాదం పెరుగుతుంది. రక్తంలోని హోమోసిస్టీన్ స్థాయిలను నియంత్రించడంలో విటమిన్ బి6 సహాయపడుతుంది. ఫోలేట్‌తో కలిసి తీసుకున్నప్పుడు హోమోసిస్టీన్ స్థాయిలను తగ్గించడంలో, భవిష్యత్తులో గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయిలను నిర్వహించడంలో కూడా ఇది ముఖ్య పాత్ర పోషిస్తుంది. మెదడు పనితీరుకు కూడా విటమిన్ బి6 అవసరం. హోమోసిస్టీన్ అధికంగా ఉండటం నాడీ వ్యవస్థ పనితీరుపై ప్రభావం చూపిస్తుంది. విటమిన్ బి6 లోపం వల్ల జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యం వంటి మెదడు పనితీరులో సమస్యలు వచ్చే అవకాశం ఉందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. అంతేకాకుండా అల్జీమర్స్, డిమెన్షియా వంటి సమస్యల ప్రమాదంతోనూ విటమిన్ బి6 లోపం సంబంధం కలిగి ఉంటుంది.మానసిక స్థితికి..మన మానసిక స్థితిపై కూడా విటమిన్ బి6 ప్రభావం చూపిస్తుంది. మెదడులో సెరొటోనిన్, నోర్ఎపినెఫ్రిన్ వంటి మూడ్‌కు సంబంధించిన హార్మోన్ల ఉత్పత్తిలో ఇది సహాయపడుతుంది. వీటి ఉత్పత్తి సక్రమంగా ఉండటం వల్ల మానసిక స్థితి మెరుగుపడటానికి తోడ్పడుతాయి. విటమిన్ బి6 తగినంతగా లభించడం డిప్రెషన్, ఆందోళన వంటి సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. రక్తహీనతను నివారించడంలోనూ విటమిన్ బి6 పాత్ర ఉంటుంది. రక్తంలోని హిమోగ్లోబిన్ శరీరంలోని వివిధ భాగాలకు ఆక్సిజన్‌ను చేరవేస్తుంది. హిమోగ్లోబిన్ తయారీలో విటమిన్ బి6 అవసరం. హిమోగ్లోబిన్ లోపం వల్ల రక్తహీనత ఏర్పడి అలసట, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. అందువల్ల ఆహారం ద్వారా తగినంత విటమిన్ బి6 పొందడం రక్తహీనతను నివారించడంలో సహాయపడుతుంది. కళ్ల ఆరోగ్యానికి కూడా విటమిన్ బి6 ఉపయోగపడుతుంది. సరైన పోషకాలు అందకపోవడం, పోషకాహార లోపాలు కంటి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపిస్తాయి. విటమిన్ బి6ను ఫోలేట్, మరికొన్ని పోషకాలతో కలిపి తీసుకోవడం వల్ల కొన్ని కంటి సమస్యలు, చూపు కోల్పోయే ప్రమాదాన్ని తగ్గించవచ్చని అధ్యయనాలు సూచిస్తున్నాయి.రక్తపోటు సమస్యకు..రక్తపోటు ఉన్నవారికి కూడా విటమిన్ బి6 ఉపయోగపడే అవకాశం ఉందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. దీని వినియోగం పెరగడం వల్ల హైబీపీ ఉన్నవారిలో రక్తపోటు తగ్గే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా ధమనుల్లో కొవ్వు లేదా ప్లాక్ పేరుకుపోకుండా నిరోధించడంలో ఇది సహాయపడుతుంది. తద్వారా గుండె సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గించవచ్చు. మహిళల్లో నెలసరి ముందు కనిపించే పీఎంఎస్ లక్షణాలను తగ్గించడంలో కూడా విటమిన్ బి6 ఉపయోగపడుతుంది. రొమ్ములో నొప్పి, వికారం, కడుపులో మంటలు లేదా తిమ్మిర్లు వంటి కొన్ని లక్షణాల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. నెలసరి ప్రారంభానికి సుమారు 10 రోజుల ముందు బి కాంప్లెక్స్ విటమిన్లు తీసుకోవాలి. ఆస్తమా ఉన్నవారికి కూడా విటమిన్ బి6 ఉపయోగపడుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. దీన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఆస్తమా దాడుల తీవ్రత లేదా తరచుదనం తగ్గే అవకాశం ఉంటుంది. వీజింగ్ వంటి కొన్ని లక్షణాలు కూడా తగ్గుతాయి.
నిద్రలేమి ఉంటే..నిద్ర సమస్యలు, ముఖ్యంగా నిద్రలేమితో బాధపడేవారికి విటమిన్ బి6 ఉపయోగపడుతుంది. శరీరంలో మెలటోనిన్ ఉత్పత్తికి ఇది సహాయపడుతుంది. మెలటోనిన్ మన శరీరంలోని నిద్ర-మేల్కొనే సమయాలను నియంత్రించే హార్మోన్. ఇది సక్రమంగా పనిచేయడం వల్ల ఎప్పుడు నిద్రపోవాలి, ఎప్పుడు మేల్కొనాలి వంటి శరీర సహజ చక్రం మెరుగ్గా కొనసాగుతుంది. కిడ్నీలో రాళ్లు ఏర్పడే ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా విటమిన్ బి6, మెగ్నిషియం కలిపి ఉపయోగపడతాయని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇతర ఆరోగ్య సమస్యల కారణంగా కిడ్నీలో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఎక్కువగా ఉన్నవారికి ఇది ప్రత్యేకంగా ఉపయోగకరంగా ఉంటుంది. అయితే విటమిన్ బి6 ఆరోగ్యానికి అవసరమైన పోషకమే అయినప్పటికీ, అవసరానికి మించి సప్లిమెంట్ల రూపంలో తీసుకోవడం సరైంది కాదు. రోజువారీ అవసరం వయస్సు, లింగం, గర్భధారణ, పాలిచ్చే దశ వంటి అంశాలను బట్టి మారుతుంది. కాబట్టి విటమిన్ సప్లిమెంట్లను తీసుకునే ముందు వైద్య నిపుణుల సలహా తీసుకోవడం మంచిది

మర్యాదపూర్వక భేటీ ఘన సన్మానం



జంగారెడ్డిగూడెం 7 టివి ఫోకస్ ఆగస్టు 9 జంగారెడ్డిగూడెం పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ కార్యక్రమం అనంతరం చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా నియోజకవర్గ ఆర్యవైశ్య సంఘం సభ్యులు కూడా పాల్గొని శాసనసభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించారు అనంతరం డూండీ రాకేష్ ని శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ ఘనంగా సన్మానించారు ఈ భేటీలో ఆర్యవైశ్య సమాజ అభివృద్ధి సంక్షేమం తదితర అంశాలపై ఆత్మీయంగా చర్చించారు

అత్యవసర పరిస్థితుల్లోనూ ప్రజలకు అండగా నిలిచిన ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్



చింతలపూడి 7 టివి ఫోకస్ ఆగస్టు 9:రాత్రి 7:30 గంటలు కావస్తున్నప్పటికీ హాస్పిటల్‌లో కుటుంబ సభ్యులు అడ్మిట్ అయి వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితిలో ఉన్న బాధిత కుటుంబాలకు శాసనసభ్యులు వెంటనే స్పందించారు చింతలపూడి మండలం శివాపురం గ్రామానికి చెందిన అర్చన మహేశ్వరి భర్త లక్ష్మయ్యకి రెండు లక్షల తొంబై వేల రూపాయల ఎల్ ఓ సి అలాగే చింతలపూడి మండలం రాఘవపురం గ్రామానికి చెందిన కొవ్వూరి నాగయ్య తండ్రి లక్ష్మయ్యకిఆరు లక్షల యాభై వేల రూపాయలు ఎల్ ఓ సి మంజూరు చేయించి అప్పటికప్పుడు వారి కుటుంబ సభ్యులకు స్థానిక నాయకుల ఆధ్వర్యంలో ఎల్ ఓ సి లేఖలను అందజేశారు మొత్తం ఎల్ ఓ సి ద్వారా అందించిన అమౌంట్ తొమ్మిది లక్షల నలభై వేల రూపాయలు అవసరంలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ భరోసాగా ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్

భారీ జన సందోహం మధ్య మలగళ్ల సతీష్ కుమార్ అంత్యక్రియలు

షాబాద్ అంబేద్కర్ యూత్ మాజీ అధ్యక్షుడికి కన్నీటి వీడ్కోలు





షాబాద్, ఆగస్టు 9:ప్రజాక్షేత్రం షాబాద్ అంబేద్కర్ యూత్ మాజీ అధ్యక్షులు మలగళ్ల సతీష్ కుమార్ అంత్యక్రియలు ఆదివారం భారీ జన సందోహం మధ్య నిర్వహించారు. సతీష్ కుమార్ మృతి విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, యువత, వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.అంబేద్కర్ యూత్ అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో సతీష్ కుమార్ యువతకు అందుబాటులో ఉంటూ సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారని పలువురు గుర్తుచేసుకున్నారు. ఆయన మృతి షాబాద్ ప్రాంతంలో విషాదాన్ని నింపిందని, యువతకు ఆయన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు.అంత్యక్రియల సందర్భంగా కుటుంబ సభ్యులను పలువురు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. భారీగా తరలివచ్చిన జన సందోహం మధ్య సతీష్ కుమార్‌కు కన్నీటి వీడ్కోలు పలికారు.

తుగ్గలి--పత్తికొండ మార్గంలో రిజిస్ట్రేషన్ పత్రాలు మాయం

పత్రాలు పోయిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు.. ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని బాధితుడి విజ్ఞప్తి

తుగ్గలి, ఆగస్టు 9 (7టీవీ ఫోకస్ న్యూస్):తుగ్గలి గ్రామానికి చెందిన కీలకమైన రిజిస్ట్రేషన్ పత్రాలు మిస్ అయిన ఘటన కలకలం రేపింది. తుగ్గలి నుంచి పత్తికొండకు ప్రయాణిస్తున్న సమయంలో మార్గమధ్యలో రిజిస్ట్రేషన్ పత్రాలు పడిపోయినట్లు బాధితుడు తెలిపారు. ఎంత వెతికినా పత్రాలు ఆచూకీ లభించకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రిజిస్ట్రేషన్ పత్రాలు ఇతరుల చేతికి చిక్కితే వాటిని దుర్వినియోగం చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ తుగ్గలి పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటనపై తుగ్గలి ఎస్సై నరేష్‌కు ఫిర్యాదు చేసి, తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేసి పత్రాల ఆచూకీ కోసం చర్యలు చేపట్టాలని కోరారు.
తమకు సంబంధించిన విలువైన రిజిస్ట్రేషన్ పత్రాలు కావడంతో పోలీసులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని విచారణ చేపట్టి, పత్రాలను గుర్తించి బాధితులకు అప్పగించాలని స్థానికులు కోరుతున్నారు.

Edited,Printed,Published and Owend by Mare Chinababu ,Printed at sravanthi prienters , rtc crss road ,Hyderabad-500001.
Published at:6-3-4, Premnagar,Behind ASHOK MALL, Banjara Hills, Road#1, Hyderabad-500 034, Telangana.